



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 16-05-2024 సంపుటి : 06 సంచిక : 242 పేజీలు : 8 వెల : రూ 3-00

## ఏపీలో హింసాత్మక ఘటనలపై ఈసీ సీరియస్.. సీఎస్, డీజీపీలకు సమన్లు




అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ అనంతరం పలు చోట్ల చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనలపై భారత ఎన్నికల సంఘం( తీవ్రంగా స్పందించింది . ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవాహర్‌రెడ్డి, రాష్ట్ర డీజీపీ హారీష్‌కుమార్ కు సమన్లు జారీ చేసింది. పల్నాడు, చంద్రగిరి, తిరుపతి,తాడిపత్రి, నంద్యాల జిల్లాలో జరిగిన హింసను ఎందుకు కంట్రోల్ చేయలేకపోయారని ప్రశ్నిస్తూ శుక్రవారం వ్యక్తిగతంగా ఢిల్లీకి వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశించింది . పోలింగ్ జరిగిన రెండు రోజులు కావస్తున్న రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలు, అల్లర్లు అదుపులోకి తీసుకురాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

# ఆ వ్యాఖ్యలు ముస్లింలనుద్దేశించి కాదు



- పేద కుటుంబాలలోనే అధిక సంతానం ఉంది
- హిందూ-ముస్లిం అంటూ మాట్లాడిన రోజున ప్రజా జీవితానికి అర్హుడిని కాను
- ముస్లింలలో నా ప్రతిష్టను ప్రత్యర్థులు నాశనం చేశారు
- మా ఇంట్లో ముస్లిం కుటుంబాలు ఉండేవి
- ఇప్పటికీ నాకు ముస్లిం మిత్రులు ఉన్నారు
- ఒక ఇంగ్లీష్ వెబ్‌సైట్ ఇంటర్వ్యూలో ప్రధాని మోడీ స్పష్టీకరణ

వారణాసి: చొరబాటుదారులు, ఎక్కువమంది సంతానం ఉన్నవారు అంటూ తాను చేసిన వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం వివరణ ఇచ్చారు. తాను కేవలం ముస్లింల గురించి మాత్రమే మాట్లాడలేదని, పేద కుటుంబాల గురించి మాట్లాడానని ఒక ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని స్పష్టం చేశారు. హిందూ-ముస్లిం అంటూ తాను మాట్లాడిన రోజున తాను ప్రజా జీవితానికి అర్హుడిని కానని మోడీ ప్రకటించారు. ముస్లింల పట్ల చూపే ప్రేమను తాను మార్కెటింగ్ చేసుకోనని ఆయన వ్యాఖ్యానించారు. తాను ఓటు బ్యాంకు కోసం పనిచేయనని, తాను సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్‌ను నమ్ముతానని ఆయన చెప్పారు. ఎక్కువ మంది సంతానం గురించి మాట్లాడిన ప్రతిసారి ఆ ప్రస్తావన ముస్లింల గురించే అని మీకు ఎవరు చెప్పారు? ముస్లింల పట్ల ఎందుకు ఇంత అన్యాయంగా ఉంటున్నారు? పేద కుటుంబాలలో కూడా ఇదే పరిస్థితి ఉంది. పేదరికం ఉన్న చోట ఎక్కువ మంది పిల్లలు ఉంటారు.వారి సామాజిక నేపథ్యం ఏదైనా కానివ్వండి. నేను హిందువులు లేదా ముస్లింలు అని ఎప్పుడూ ప్రస్తావించలేదు. స్తోమతను బట్టే సంతానం సంఖ్య ఉండాలని మాత్రమే నేను చెప్పాను. మీ పిల్లల సంరక్షణను ప్రభుత్వం తీసుకునే పరిస్థితి తీసుకురానివ్వకండి అని ప్రధానిస్పష్టం చేశారు. గుజరాత్‌లో గోద్రా రైలు దగ్ధం ఘటన అనంతరం జరిగిన అల్లర్ల గురించి ప్రస్తావిస్తూ తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 2002(గోద్రా అల్లర్లు) తర్వాత ముస్లింలలో తన ప్రతిష్టను ప్రత్యర్థులు నాశనం చేశారని ప్రధాని చెప్పారు. ఇది ముస్లింలకు సంబంధించిన సమస్య కాదు. కొందరు ముస్లింలు మోడీకి మద్దతుగా ఉన్నప్పటికీ ఇది చేయండి..అది చేయండి అంటూ ప్రభంజనంలా జరిగే ప్రచారం వారిపై ప్రభావం చూపుతుంది.మా ఇంట్లో నా చుట్టూ ముస్లిం కుటుంబాలే ఉండేవి. మా ఇంట్లో ఈద్ కూడా జరుపుకునేవారం. ఇతర పండుగలు కూడా మా ఇంట్లో జరిగేవి. ఈద్ రోజున మా ఇంట్లో వంట ఉండేది కాదు. అన్ని ముస్లిం కుటుంబాల నుంచి మా ఇంటికి భోజనం వచ్చేది. ఇప్పటికీ నాకు చాలా మంది ముస్లిం మిత్రులు ఉన్నారు. 2002 తర్వాత(గోద్రా) నా ప్రతిష్ట నాశనం అయ్యింది అని మోడీ ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికలలో ముస్లింలు మీకు ఓటు వేస్తారా అన్న ప్రశ్నకు ఈ దేశ ప్రజలు నాకు ఓటు వేస్తారు అని మోడీ జవాబిచ్చారు.

## పల్నాడు ఘటనపై సీఎం దిగ్భ్రాంతి



అమరావతి మే 15, : పల్నాడు జిల్లాలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం లో ఆరుగురు సజీవదహనం ఘటనపై ఏపీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్న క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ లో నివాసముంటున్న 40 మంది ఓటర్లు ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకునేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వారు ప్రయాణిస్తున్న బస్సును కంకర టిప్పర్ ఢీకొట్టడంతో టిప్పర్‌లో మంటలు చెలరేగి బస్సుకు కూడా అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు సజీవదహనం కాగా మరోకరు చికిత్సపొందుతూ మృతి చెందారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువగా నీలాయపాలెం గ్రామానికి చెందిన వారే అధికంగా ఉన్నారు

## సీఎస్ జవహర్‌రెడ్డితో డీజీపీ గుప్తా భేటీ..!

అమరావతి మే 15 ( ఆంధ్రరేఖ ప్రతినిధి) : ఈ నెల 13న జరిగిన ఎన్నికల పోలింగ్ సందర్భంగా చెలరేగిన హింసాత్మక ఘటనలపై కేంద్ర ఎన్నికల తీవ్రంగా పరిగణించింది. ఆయా ఘటనలపై వివరణ ఇవ్వాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాలను ఆదేశించింది. వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఎన్నికల సంఘం సమన్లు పంపింది. ఈ క్రమంలో సీఎస్, డీజీపీ ఇద్దరు గురువారం ఢిల్లీకి వెళ్లి వివరణ ఇవ్వనున్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డితో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా సమావేశమయ్యారు. సచివాలయంలో అత్యవసరంగా భేటీ అయ్యారు. డీజీపీ వెంట ఇంటలిజెన్స్ ఏడీజీ కుమార్ విశ్వజిత్ సైతం ఉన్నారు. ఎన్నికల సంఘం స్వయంగా హాజరైవివరణ ఇవ్వాలని చెప్పిన నేపథ్యంలో సీఎస్, డీజీపీ సమావేశమై ఈసీకి ఇవ్వాల్సిన నివేదికపై చర్చించనున్నట్లు తెలుస్తున్నది.

# పల్నాడు జిల్లాలో ఘోరం.. ఆరుగురు సజీవదహనం

## ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన టిప్పర్..



పల్నాడు మే 15 ఓటు వేసేందుకు సొంతూరుకు వెళ్లి ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న ఆ ఐదుగురి జీవితాలు తెల్లారేసరికే తెల్లారిపోయాయి. టిప్పర్ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు వారిని అనంతలోకాలకు తీసుకెళ్లింది. ట్రావెల్స్ బస్సును టిప్పర్ ఢీకొట్టడంతో బస్సు డ్రైవరుతో సహా ఐదుగురు సజీవదహనమయ్యారు. ఈ ఘటనలో మరో 20 మంది గాయపడ్డారు. పల్నాడు జిల్లా చిలూకలూరిపేట మండలంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం రాత్రి ప్రైవేటు ట్రావెల్స్ అయిన అరవింద ట్రావెల్స్ బస్సు బాపట్ల జిల్లా చినగంజాం నుంచి పర్చూరు, చిలకలూరిపేట మీదుగా హైదరాబాద్‌కు 40 మంది ప్రయాణికులతో బయలుదేరింది. బస్సులో చినగంజాం, గొనసపూడి, నీలాయపాలెం వారు ఎక్కువగా ఉన్నారు. వీరంతా ఏపీ ఎన్నికల్లో ఓటేసి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైన వారే. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో బస్సు చిలకలూరిపేట మండలం అన్నంబట్లవారి పాలెం పసుమర్రు గ్రామాల మధ్యనున్న ఈవూరివారిపాలెంకు చేరుకోగానే ఎదురుగా కంకర లోడుతో వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీకొట్టింది.క్షణాల్లో టిప్పర్‌లో మంటలు చెలరేగి వెంటనే బస్సుకు అంటుకున్నాయి. ప్రయాణికులు హాహాకారాలు చేస్తూ కిందకు దిగేలోపే దాదాపు 20 మందికి మంటలు అంటుకున్నాయి. డ్రైవర్ సహా ఐదుగురు బస్సులోనే సజీవ దహనమయ్యారు. స్థానికులు వెంటనే పోలీసులకు, 108కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు.కాగా,బాధితుల ఆర్తనాదాలతో విషాదం అలుముకుంది. చిలకలూరిపేట, యద్దనపూడి,చీరాల,యద్లపాడు నుంచి 108 వాహనాలను ప్రమాద స్థలికి రప్పించారు.

## పల్నాడు లో 144 సెక్షన్



మాచర్ల,మే15: పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ కొనసాగుతోంది. పోలింగ్ అనంతరం జరుగుతున్న దాడుల నేపథ్యంలో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. కారంపూడి, కొత్తగణెళిషునిపాడులో హింసాత్మక ఘటనలు జరిగినందున బలగాలను మోహరించారు. జిల్లాలోని మాచర్ల, గురజాల, నరసరావుపేట నియోజకవర్గాలపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మొత్తం 19 కంపెనీల బలగాలను మోహరించారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మాచర్లలోనే ఉండి పర్యవేక్షిస్తున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ కూడా అక్కడే ఉన్నారు. మాచర్లలో అడుగడుగునా పోలీసులు మోహరించారు. పట్టణంలోకి వచ్చేవారి వాహనాలను తనిఖీ చేపట్టారు. జిల్లాలో వైకాపాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. గురజాలలో కాసు మహేశ్‌రెడ్డి, నరసరావుపేటలో గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ముగ్గురి కంటే ఎక్కువమంది గుమిగూడవద్దని ఎస్పీ బిందుమాధవ్ హెచ్చరించారు. సామాన్యుల జీవనానికి ఆటంకాలు కలిగించబోమన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

## పల్నాడు రోడ్డు ప్రమాద ఘటనపై ఏపీ సీఎం జగన్ విచారం

అమరావతి : పల్నాడు జిల్లాలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం లో ఆరుగురు సజీవదహనం ఘటనపై ఏపీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్న క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ లో నివాసముంటున్న 40 మంది ఓటర్లు ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకునేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వారు ప్రయాణిస్తున్న బస్సును కంకర టిప్పర్ ఢీకొట్టడంతో టిప్పర్‌లో మంటలు చెలరేగి బస్సుకు కూడా అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు సజీవదహనం కాగా మరోకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువగా నీలాయపాలెం గ్రామానికి చెందిన వారే అధికంగా ఉన్నారు



# సంపాదకీయం

గురువారం 16-05-2024

## అభివృద్ధి అంశాలు లేకుండానే ఎన్నికలు

70 శాతం సీట్లకు పైగా స్థానాలకు లోక్‌సభ ఎన్నికలు పూర్తికాగా, ఎన్నికల ప్రచారం గతి తప్పుతున్నట్టు స్పష్టం అవుతుంది.ఎన్నికల్లో ప్రజాతీర్పుపై ఎంతో భరోసాతో ప్రచారం ప్రారంభించిన కీలక నేతలు ఆత్మరక్షణలో పడి తమ రాజకీయ మనుగడ కోసం విలువలకు తిలోదకాలిస్తున్నట్లు స్పష్టం అవుతున్నది. 'ఇండియా' కూటమి ద్వారా నరేంద్ర మోడీ ప్రభంజనాన్ని అడ్డుకోగలననే ధీమాతో ఎన్నికల ప్రచారం ప్రారంభించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు తమ కుటుంబానికి బలీయమైన రెండు నియోజకవర్గాలలో ఎక్కడినుండి పోటీ చేయాలో తేల్చుకోలేక, చివరకు ఒక చోట నుండి పోటీ చేస్తున్న దృశ్యం కనిపిస్తున్నది.1980 నుండి గాంధీ కుటుంబానికి కంచుకోటగా ఉండటమే కాకుండా వరుసగా ఐదుసార్లు సోనియా గాంధీని ఎన్నుకున్న రాయబరేలి కేవలం సురక్షిత స్థానం అని మాత్రమే ఎంచుకొన్నట్లు స్పష్టం అవుతుంది. వరుసగా ఐదోసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాహుల్ చెల్లెలు ప్రియాంక గాంధీని ఎన్నికల్లో దింపేందుకు ప్రధాని మోడీ చేస్తున్న 'కుటుంబ రాజకీయాలు' విమర్శలకు భయపడి వెనుకడుగు వేసినట్టు కూడా తెలుస్తున్నది. ఒక వంక ప్రధాని మోడీ ఎన్నికల ప్రచార సభలలో 'యువరాజు'(రాహుల్ గాంధీ)ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తుండగా, ఆయన మాత్రం తన సీటు విషయంలో తికమక పడుతున్నట్లు వెల్లడవుతున్నది. ఎందుకంటె రాయబరేలి, అమేథీ సీట్లను గెల్చుకోవడం ద్వారా మాత్రమే ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్ తన ఉనికి కాపాడుకోగలదు.వరుసగా కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే అనేక ప్రాంతీయ పార్టీల మనుగడ ప్రశ్నార్ధకం కాగలదు అనే అంశం ఈ సందర్భంగా పలువురి దృష్టిని ఆకర్షిస్తోంది. ఉంటె తమతో కలిసి ఉండాలి లేదా అటువంటి వారి ఉనికి ప్రశ్నార్ధకం కాగలదని హెచ్చరికలను ప్రధాని స్వయంగా ఇచ్చినట్లయింది. ఎన్నికల పొత్తుకోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో జూన్ 4 తర్వాత ఒడిశాలో బిజెడి ఉనికి ప్రశ్నార్ధకం కాగలదని ఈ సందర్భంగా సంకేతం ఇవ్వడం గమనార్హం. తెలుగు రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలకు సైతం అటువంటి హెచ్చరికలు వెలువడుతున్నాయి. నేడు జెఎంఎం అధినేత హేమంత్ సొరేన్, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వంటి వారు ఇటువంటి హెచ్చరికలను ఖాతరు చేయకుండా కాంగ్రెస్‌తో పొత్తులు చేసుకున్న కారణంగానే జైళ్లలో గడపాల్సి వస్తుందని మరచిపోలేము. బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవిత సైతం అందుకోసమే జైలుకు వెళ్లాల్సి వచ్చిందని స్వయంగా కెసిఆర్ ఆరోపిస్తున్నారు. ఇటువంటి సవాళ్ళను కేజ్రీవాల్, ఉద్ధవ్ థాక్రే, శరద్ పవర్, హేమంత్ సోరెన్, కెసిఆర్ వంటి వారు ధైర్యంగా ఎదుర్కొనే ప్రయత్నం చేస్తున్నారు.మరోవంక ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారం పాకిస్తాన్, ముస్లింల చుట్టూ తిరుగుతూ ఉండటం విస్మయం కలిగిస్తోంది. మన సరిహద్దుల్లో ఇంకా రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలను సైతం చేబడుతున్న చైనా గురించి మాట్లాడే ధైర్యం చేయడం లేదు. కానీ రాహుల్ గాంధీ గెలుపొందాలని పాకిస్తాన్ కోరుకుంటుందని అంటూ అక్కడ అధికారం కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్ మంత్రివర్గంలో పని చేసిన ఒకరి మాటలను పట్టుకొని ప్రచారం చేయడం గమనిస్తే తమ ప్రభుత్వ పనితీరు ఆధారంగా మరోసారి గెలుపొందగల నమ్మకం సడలుతుందా అనే ప్రశ్న తలెత్తుతుంది. సామ్ పిట్రో, మణిశంకర్ అయ్యర్ వంటి కాలంచెల్లిన నాయకులు ఎన్నికల సమయంలో చేస్తున్న బాధ్యతారహిత వ్యాఖ్యలు పార్టీని ఇరకాటంలో పడవేస్తున్నా బిజెపికి బలమైన ప్రచార ఆయుధాలు సమకూరుస్తున్నా అటువంటి వారిని కట్టడి చేయడంలో రాహుల్ ఓ విధంగా నిస్సహాయంగా కనిపిస్తున్నారు.తనదారి తనదే గాని, మొత్తం పార్టీని తనతో తీసుకెళ్లడంలో మొదటి నుండి విఫలమవుతున్నారు. అందుకనే రాహుల్ నాయకత్వం సామర్థ్యంపై కాంగ్రెస్‌లోనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భారత్‌కు మాత్రమే కాకుండా అనేక దేశాలకు ఆందోళనకరంగా మారిన చైనా ధోరణులను కట్టడి చేసేందుకు దృఢవైఖరిని అవలంబించలేకపోతున్నాము. ముఖ్యంగా వాణిజ్యలోటు ప్రతి ఏడాది పెరుగుతున్నా తగ్గించే ప్రయత్నం చేయలేకపోయాము. కీలక రంగాలలో చైనా పై ఆధారపడటం జాతీయ భద్రతకు ప్రమాదరకరమనే హెచ్చరికలను పట్టించుకోలేక పోతున్నాం. భారత్ అని బూచిని చూపి పాకిస్తాన్‌లో ఇప్పటి వరకు రాజకీయాలను శాసిస్తూ వస్తున్న సైన్యం ఆధిపత్యానికి గండిపడుతోంది. కానీ భారత్ నాయకత్వం మాత్రం పాకిస్తాన్ బూచి చూపిస్తూ ఇక్కడ తమ రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నది. దాదాపు అన్ని రాజకీయ పార్టీలలో తమ నాయకత్వంపై ఓ విధమైన 'అసహనం', 'అవిశ్వాసం' వెల్లడి కావడం నేడు భారత రాజకీయ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యగా భావించవచ్చు. బిజెపి అభ్యర్థులలో నాలుగోవంతు మంది ఎన్నికల సమయంలో పార్టీలో చేరినవారే. నిన్నటి వరకు తాము అవినీతిపరులుగా, ప్రజావ్యతిరేకమైన వారుగా విమర్శలు కురిపించిన వారి విజయం కోసం ఇప్పుడు తామెందుకు పని చేయాలనే నిర్లిప్తత ఆ పార్టీ శ్రేణులలో వ్యక్తం అవుతుంది. తమపై దాడులకు తలపడిన వారు కొందరు ఇప్పుడు తమ అభ్యర్థులుగా రావడాన్ని సహింపలేకపోతున్నారు. సుమారు 120 మంది ప్రస్తుత ఎంపిలను, వారిలో పలువురు తిరిగి గెలుపొందే అవకాశం ఉందని అంతర్గత సర్వేలు వెల్లడించిన్నప్పటికీ తిరిగి సీటు ఇవ్వకుండా మార్చడం బిజెపిలో అంతర్గతంగా నాయకత్వం ధోరణుల పట్ల అసహనం వ్యక్తం అవుతుంది.పోటీకి దిగడాన్ని ఆయా పార్టీల శ్రేణులు తమాయించుకోలేక పోతున్నారు. తాము ఆయా పార్టీల జాతీయ నాయకులకు 'ముడుపులు' చెల్లించి తాను సీటు కొన్నానని అర్థాంతరంగా చివరి నిమిషంలో పార్టీలో చేరి, సీటు కైవసం చేసుకున్న పలువురు అభ్యర్థులు స్థానికంగా ప్రచారం చేసుకొంటూ ఉండటంతో ఆయా పార్టీల నాయకులు తలలుపట్టుకోవలసి వస్తుంది.నాలుగైదు ఇప్పుడు ఎన్నికల సమయంలో పార్టీకి సంబంధం లేని వ్యక్తిని అభ్యర్థిగా తీసుకు రావడం, ఆ అభ్యర్థి ఎన్నికల అనంతరం కనిపించని పరిస్థితి నెలకొనడం ఇప్పుడు పలు చోట్ల, పలు పార్టీలలో జరుగుతుంది.

# కల్నల్ వైభవ్ కాలే మృతి.. క్షమాపణలు చెప్పిన యూఎన్





న్యూఢిల్లీ, మే 15, గాజాలో భారత్‌కు చెందిన మాజీ ఆర్మీ అధికారి మృతిపై ఐక్యరాజ్య సమితి విచారం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా భారత్‌కు క్షమాపణలు చెప్పింది. కల్నల్ వైభవ్ అనిల్ కాలే (46) గాజాలోని రఫాలో ఓ వాహనంలో ప్రయాణిస్తుండగా దాడి జరిగింది. ఈ ఘటనలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఆయన 2022 వరకు సైన్యంలో పని చేసిన ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ కోరారు. ప్రస్తుతం ఐక్యరాజ్య సమితి భద్రత విభాగంలో సమన్వయ అధికారిగా పని చేస్తున్నారు.ఆయన సైన్యంలో ఉన్న సమయంలో 11వ జమ్మూ కశ్మీర్ రైఫిల్స్‌కు నాయకత్వం వహించారు. ఈ ఘటనలో యునైటెడ్ నేషన్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీలో అనిల్ కాలేతో కలిసి పనిచేస్తున్న జోర్డాన్ మహిళ సైతం ప్రాణాలు కోల్పోయింది. ఐక్యరాజ్యసమితి సిబ్బంది ఐక్యరాజ్యసమితికి చెందిన చిహ్నాలతో కూడిన వాహనంలో రఫాలోని యూరోపియన్ యూనియన్ ఆసుపత్రికి వెళుతుండగా వాహనంపై వెనుక వైపు నుంచి దాడి జరిగింది.ఇజ్రాయెల్ ఆర్మీ యుద్ధ ట్యాంక్‌తో దాడి జరిపిందని భావిస్తున్నారు. వైభవ్ అనిల్ కాలే మృతిపై ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ సంతాపం వ్యక్తం చేశారు. ఘటనపై దర్యాప్తునకు ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ఆర్మీ చేసిన దాడి అయి ఉండవచ్చని ప్రాథమిక విచారణలో తేలింది. ప్రస్తుతం గాజాలో 71 మంది యూఎస్ సిబ్బంది పనిచేస్తున్నారు. గాజాలో ఇప్పటివరకు 190 మందికి పైగా ఐక్యరాజ్యసమితి ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. అయితే, తొలిసారిగా అంతర్జాతీయ ఉద్యోగి మరణించడం ఇదే తొలిసారి.

# ఉత్తరాఖండ్ అడవుల్లో ఆగని మంటలు..

## రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు మండిపాటు


డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ అడవుల్లో రాజుకున్న మంటలను నియంత్రించలేకపోతున్నారు.ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు మండిపడింది. అటవీ శాఖ సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాగే నిధులు కేటాయించని కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడింది. గత ఏడాది నవంబర్ నుంచి ఉత్తరాఖండ్ అడవుల్లో మంటలు చెలరేగుతున్నాయి. మంటలు విస్తరిస్తుండటంతో 1,437 హెక్టార్లకుపైగా పచ్చని చెట్లు కాలిపోయాయి. అటవీ ప్రాంతం దగ్ధంతో లక్షల్లో నష్టం వాటిల్లింది.కాగా, ఉత్తరాఖండ్ అడవుల్లో చెలరేగిన మంటలను నియంత్రించకపోవడంపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. 40 శాతంపైగా అడవులు అగ్నికి ఆహుతైనట్లు న్యాయవాది పరమేశ్వర్ కోర్టుకు తెలిపారు.




మంటలను నియంత్రించలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మరోవైపు ఉత్తరాఖండ్ ప్రభుత్వం తరుపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అడవుల్లో కొత్తగా మంటలు లేవని తెలిపారు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన నిధులు అందలేదని చెప్పారు. మంటల నియంత్రణకు 9,000 మందికిపైగా పని చేస్తున్నారని అన్నారు. కేంద్రం, రాష్ట్రానికి చెందిన ఆరుగురు సభ్యుల కమిటీ పర్యవేక్షిస్తున్నదని, 420 కేసులు నమోదయ్యాయని వివరించారు.కాగా, అడవుల్లో మంటల నియంత్రణకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం పది కోట్లు డిమాండ్ చేయగా కేంద్రం రూ.3.15 కోట్లు కేటాయించడంపై సుప్రీంకోర్టు కోర్టు మండిపడింది. అలాగే అటవీ శాఖ సిబ్బందిని ఎన్నికల విధుల్లో నియమించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర, రాష్ట్రా ప్రభుత్వాల నిర్లక్ష్యం, బాధ్యతా రహిత్యంపై సర్వోన్నత న్యాయస్థానం నిప్పులు చెరిగింది.

# 'అమెరికాలో చైనా సైన్యాన్ని నిర్మిస్తోంది'.. ఎన్నికల ప్రచారంలో ట్రంప్ వ్యాఖ్యలపై రచ్చ

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై మరోసారి విమర్శలు చేశారు. ఆ దేశం అమెరికాలో తన సైన్యాన్ని నిర్మిస్తోందని ఆరోపించారు. చైనా నుంచి అమెరికాకు వలసలు భారీగా పెరిగాయని.. వాటివల్ల భవిష్యత్తులో ముప్పు పొంచివుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై రచ్చ జరుగుతోంది.'మిలిటరీ ఏజ్'లో ఉన్న ఆ దేశ పౌరులు ఓ సైన్యంగా మారేందుకు అమెరికాకు వస్తున్నారని, వాళ్లు సైన్యంగా మారి దాడిచేస్తారని పుతిన్ వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. 'చైనా నుంచి భారీ సంఖ్యలో పౌరులు వస్తున్నారు. వారిదంతా సైన్యం వయసే. అందులోనూ పురుషులే అధికం. వారిని చూస్తుంటే మన దేశంలో చిన్న సైన్యాన్ని నిర్మించేందుకు యత్నిస్తున్నారా..? అనిపిస్తోంది. వారి ప్రయత్నం కూడా అదేనా..?' అని పెన్సిల్వేనియాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ వ్యాఖ్యానించారు.కాగా, కొవిడ్ ఆంక్షలు ఎత్తివేసిన తర్వాత చైనా నుంచి అమెరికాకు అక్రమ వలసలు పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. దక్షిణ అమెరికాకు విమానాల్లో చేరుకొని.. అక్కడి నుంచి ప్రమాదకరమైన మార్గాల్లో, కాలినడకన ఉత్తర అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తున్నట్లు సమాచారం. 2023 లోనే అమెరికా-మెక్సికో సరిహద్దులో 37 వేల మంది చైనీయులను అరెస్టు చేసినట్లు సమాచారం. 2022తో పోలిస్తే ఇది 10 రెట్లు ఎక్కువ. గత డిసెంబర్‌లోనే అక్రమంగా ప్రవేశిస్తోన్న 5,951 మందిని యూఎస్ అధికారులు అరెస్టు చేశారు.అమెరికాలోకి చైనీయుల అక్రమ ప్రవేశాలు గణనీయంగా పెరిగినట్లు ట్రంప్‌తో పాటు రిపబ్లికన్ నేతలు భావిస్తున్నారు. దాంతో



భౌగోళికంగా, రాజకీయపరంగా ముప్పు ఉందని ఆందోళన చెందుతున్నారు. అయితే, కొవిడ్ సమయంలో డ్రాగన్ కఠిన ఆంక్షలవల్ల కలిగిన ఆర్థికనష్టం నుంచి, పేదరికం నుంచి తప్పించుకునేందుకే తాము అమెరికాకు వచ్చినట్లు చైనా వలసవాదులు కొందరు చెబుతున్నారు. ఇక్కడ కూడా తమ జీవితాలు తాము ఊహించినట్లు లేవని, చాలా కష్టపడాల్సి వస్తోందని వాపోయారు.ట్రంప్ ప్రసంగాలు చైనాతోపాటు ఇతర ఆసియా దేశాల పౌరులపై ద్వేషాన్ని పెంచుతాయని, చైనీయులపై ద్వేషానికి వ్యతిరేకంగా పోరాడుతున్న సింథియా చోయ్ అన్నారు. అనేక మంది ఆసియన్ అమెరికన్లలో భయం నెలకొందని, ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగించేందుకు వెనకాడుతున్నారని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఏసియన్ పసిఫిక్ అమెరికన్స్ డైరెక్టర్ గ్రెగ్ ఓర్టాన్ అభిప్రాయపడ్డారు.

## ఖమ్మంలో చెట్టును ఢీకొట్టిన కారు



బోనకల్: ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట్లలో బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో దంపతులు మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతులు సూర్యనారాయణ, రుక్మిణిగా పోలీసులు గుర్తించారు. బాధితులు ఖమ్మంలోని మామిళ్లగూడెం వాసులుగా గుర్తించారు. ప్రమాదం జరిగిన కాసేపటి తరువాత కారులో మంటలు చెలరేగినట్టు సమాచారం.

## 'న్యూస్ క్లిక్' వ్యవస్థాపకుడు ప్రబీర్ విడుదలకు సుప్రీం ఆదేశాలు



న్యూఢిల్లీ: ఉగ్రవాద నిరోధక చట్టం(ఉపా) కింద అరెస్టైన న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థను విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసులో ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేయడం చట్టవిరుద్ధమని.. రిమాండ్ కాపీ కూడా అందించలేదని న్యాయమూర్తులు బిఆర్ గవాయ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం బుధవారం ప్రబీర్ అరెస్టును తప్పుబట్టింది. ఎందుకు అరెస్టు చేశారన్న విషయాలను న్యాయస్థానికి వెల్లడించలేదని.. రిమాండ్ ఆర్డర్ చెల్లదని జస్టిన్ మోహతా చెప్పారు. కాబట్టి.. పంకజ్ బన్సల్ కేసు తరహాలో ప్రబీర్ ను కస్టడి నుంచి విడుదల చేయాలని ఆదేశించారు.కాగా, చైనా నుంచి నిధులు తీసుకుని ఆ దేశ ఏజెండా గురించి.. న్యూస్ క్లిక్ సంస్థ అనుకూలంగా కథనాలు ప్రచురించినట్లు న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఆరపణలు చేసింది. దీంతో ఉగ్రవాద నిరోధక చట్టం(ఉపా) కింద గత ఏడాది అక్టోబర్ 3న ప్రబీర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## పోలీసు వాహనాన్ని పేల్చిన మావోయిస్టులు



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో పోలీసు వాహనాన్ని మావోయిస్టులు పేల్చారు. సోమన్‌పల్లి-రాణిబొడ్డి మధ్య గన్నం నాలా వద్ద ఐఇడి పేలుడు చోటుచేసుకుంది. వాహనం ముందుభాగం పేలుడు సంభవించడంతో ఎస్ఐ, కానిస్టేబుల్ ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. వారు స్వల్పంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. పేలుడుకు పాల్పడిన మావోయిస్టుల కోసం భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

## బోరుబావికి మరమ్మత్తులు చేయించిన మున్సిపల్ చైర్మన్ పెండ్రు రమా

మంథని,మంథని మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు (గౌడ్స్ వాడ)లో బోరుబావికి మరమ్మత్తు పనులను మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేష్ రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించి మున్సిపల్ సిబ్బంది చేత మరమ్మత్తులుచేయించారు.12వ వార్డు గౌడ్స్ వాడలో నీటి సమస్యలు నివారించుటకు వార్డు ప్రజల సౌక్యార్థం వాటర్ బోర్ మరమ్మత్తు పనులను చేపించినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమ సురేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగావార్డు ప్రజలు బోర్ బావికి మరమ్మత్తు పనులు చేపించినందుకు గాను చైర్ పర్సన్ కి కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వేముల లక్ష్మి , కాంగ్రెస్ నాయకులు వేముల సమ్మయ్య, మాచిడి రవితేజ గౌడ్,టి రాజు లతో పాటు పలువురు పాల్గోన్నారు.

## యువకుడు ఆత్మహత్య

మేడ్చల్,ఉద్యోగం రావట్లేదని మనస్థాపం చెందిన వడ్లకొండ రంజిత్(24) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి చెంగిచెర్ల లోని కనకదుర్గ కాలనీలో మే12న జరిగింది.రంజిత్ తల్లి భాగ్యమ్మ(48) మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఉద్యోగం రావట్లేదని మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పిర్యాదు చేశారు. ఈ నెల 11న కీసర పోలీస్ స్టేషన్ పరిధి కరీంగూడ చౌరస్తాలో 25 లక్షల హవాలా డబ్బు కేసులో ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్ అయ్యారు.

# 81.79 శాతానికి చేరిన ఓటింగ్

విజయవాడ, మే 15 ,ఏపీలో అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిశాయి. పోలింగ్ రోజు అర్ధరాత్రి వరకు కూడా క్యూలైన్‌లో ఉన్న ఓటర్లకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు ఎన్నికల అధికారులు. కొన్ని ప్రాంతాల్లో అర్ధరాత్రి 2 గంటల వరకు కూడా పోలింగ్ కొనసాగింది. అయితే ఏపీలో మొత్తంగా 81.79 శాతం నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. కాగా, సాధారణ ఓటింగ్‌లో 80.59శాతం నమోదైంది. 1.2 శాతం పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి.. మొత్తం పోలింగ్ పర్సంటేజ్ 81.79కి చేరింది. ఇవే తుది లెక్కలు కాదు. పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

ఇక జిల్లాల వారీగా పోలింగ్ శాతాన్ని ఎలా ఉందో చూద్దాం..

వైఎస్సార్ జిల్లా -79.40 శాతంపశ్చిమగోదావరి ? 82.70 శాతంవిజయనగరం -81.34 శాతంవిశాఖ -71.11 శాతంకర్నూలు -75.83 శాతంకృష్ణ -84.05 శాతంకాకినాడ -80.05 శాతం

గుంటూరు ? 78.81 శాతంతిరుపతి -77.82 శాతంశ్రీకాకుళం -76.07 శాతంసత్యసాయి -82.77 శాతంనెల్లూరు -82.10 శాతంప్రకాశం -87.09 శాతంపార్వతీపురం -77.10 శాతంపట్నాడు -85.65 శాతంఎన్టీఆర్ -79.68 శాతంనంద్యాల -80.92 శాతంఏలూరు -83.55 శాతంతూర్పుగోదావరి -80.94 శాతంకోనసీమ-83.91 శాతంచిత్తూరు -87.09 శాతంబాపట్ల-84.98 శాతంఅన్నమయ్య -76.23 శాతంఅనంతపురం -79.25 శాతంఅనకాపల్లి -83.84 శాతంఅల్లూరి -70.20 శాతంరాయలసీమలో భారీ ఓటింగ్తిరుపతి, మే 15 (న్యూస్ పల్స్)సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నాలుగో విడత ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు రికార్డు సృష్టించాయి. ఏపీలో ఏకంగా రికార్డు స్థాయిలో 80 శాతం పోలింగ్ నమోదైంది. గతంలో ఎన్నడు జరుగని విధంగా మే 13వ తేదీ అర్ధరాత్రి దాటే వరకు చాలా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓట్లు వేశారు. దీంతో పెరిగిన పోలింగ్ ఎవరికి అనుకూలమో అన్న చర్చలు ఇప్పుడు ఏపీలో జోరుగా సాగుతున్నాయి.ఇక ఏపీలోని రాయలసీమలో ఓటింగ్ శాతం గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీగా నమోదైంది.ఓటర్లు ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మధ్యాహ్నం సమయంలో కాస్త రద్దీ తగ్గినట్లు కనిపించింది. ఇక సాయంత్రం 5 గంటల తర్వాత మళ్లీ పోలింగ్ కేంద్రాలో ఓటర్లతో కిటకిటలాడాయి. 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసినా అప్పటికే చాలా కేంద్రాల్లో క్యూలైన్లు కిలోమీటర్ల మేర బారులు తీరి కనిపించాయి. క్యూలైన్లలో ఉన్న అందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు.సార్వత్రిక ఎన్నికల్లో రాయల సీమలో మహిళలు, యువతలో ఓటు చైతన్యం ఎక్కువగా కనిపించింది. సాయంత్రం బారులు తీరినవారిలో మహిళలు, యువతే ఎక్కువగా కనిపించింది. ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా కడపలో గతంలో కంటే ఎక్కువగా 78.71 శాతం పోలింగ్ నమోదైంది. కర్నూలు జిల్లాలోనూ పోలింగ్ శాతం భారీగా పెరిగింది. 75.83 శాతం, నంద్యాలలో గతంలో మాదిరిగానే 80.92 శాతం పోలింగ్ శాతం నమోదైంది. చిత్తూరులో 82.65 శాతం, సత్యసాయి జిల్లాలో 82.40 శాతం, పల్నాడులో 78.70 శాతం, అన్నమయ్య జిల్లాలో 76.12 శాతం పోలింగ్ నమోదైంది. నెల్లూరు జిల్లాలో 78.10 శాతం మంది ఓటేశారు. దాదాపు రాయలసీమ అంతటా 75 శాతం పైనే పోలింగ్ నమోదైంది.

# ఎరక్కపోయి... ఇరుక్కుపోయిన యాంకరమ్మ

విజయవాడ, మే 15, ఏపీలో పోలింగ్ పూర్తయ్యాక, పోలింగ్ బూత్స్ దగ్గర పబ్లిక్ పల్స్ చూశాక తీరిగ్గా దిగాలు పడుతోందట. నెక్స్ట్ సిట్యువేషన్ ఏంటని, పబ్లిక్ నుంచి ఎటువంటి రియాక్షన్ వస్తుందని క్లోజ్ ఫ్రెండ్ సర్కిల్, ఇండస్ట్రీలో న్యూట్రల్ పీపుల్‌ను ఇంక్వయిరీ చెయ్యడం స్టార్ట్ చేసిందట. పొలిటికల్ పబ్లిసిటీకి పోయి ఆవిడ కెరీర్ రిస్క్ చేసుకుందని కొందరు కామెంట్స్ చేస్తున్నారు.రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఎవ్వరు ఉండరని పెద్దలు తరచూ చెప్పే మాట. ఒకప్పుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీద నిప్పులు చెరిగిన నటి రోజా, అనంతరం వైసీపీలో చేరి జగన్ విధేయురాలు అయ్యింది. ఒకప్పుడు చిరంజీవి ప్రజా రాజ్యంలో పని చేసిన పోసాని కృష్ణమురళి, ఇప్పుడు మెగా కుటుంబం మీద తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ఎన్నికలు పూర్తయ్యాక పార్టీ అధికారంలోకి రాకపోతే జెండా మార్చేసే రాజకీయ నాయకులకు దేశంలో, తెలుగు రాష్ట్రాల్లో కొదవ లేదు. ఇటువంటి ఉదాహరణలు రాజకీయాల్లో కోకొల్లలు. కాని ఫిల్మ్ ఇండస్ట్రీలో అలాంటి పరిస్థితులు ఉండవు.ఇండస్ట్రీలో నలుగుర్నీ కలుపుకుపోవాలి కాని నలుగురి చూపుల్లో పడేలా లీడర్స్ మీద కామెంట్ చెయ్యడం తగదు. చిన్న చిన్న విమర్శలను కూడా సీరియస్‌గా తీసుకుంటారు. ఎందుకొచ్చిన గొడవ అని కామెంట్స్ చేసిన సెలబ్రిటీలను దూరం పెడతారు. ఏపీలో ఒక పార్టీకి మద్దతుగా పబ్లిసిటీ ప్రోగ్రామ్స్‌లో యాక్టివ్‌గా పార్టిసిపేట్ చేసిన యాంకరమ్మ, ముసలి ముతక అంటూ ఇంటర్వ్యూల్లో పిట్టకథలు చెప్పింది. అది ఆవిడ కొంప ముంచేలా వుందని టాలీవుడ్ గుసగుస.ఏపీలో అధికార పగ్గాలు ఎవ్వరు చేపట్టినా ఇండస్ట్రీలో కొన్ని కుటుంబాలు, కొన్ని వర్గాల ఆధిపత్యం ఉంటుంది. ఆయా కుటుంబాలకు కోపం వచ్చేలా యాంకర్ వ్యవహరించింది. దాంతో ఆవిడకు వెండితెర, బుల్లితెరపై కనిపించడం క్రమక్రమంగాతగ్గుముఖం పట్టవచ్చని ఫిల్మ్ నగర్ ఖబర్. యాంకర్ సపోర్ట్ చేసిన పార్టీ పవర్‌లోకి వచ్చినా ఆవిడకు అవకాశాలు రావడం గగనమే అంటున్నారు. లాస్ట్ ఫైవ్ ఇయర్ అబ్జర్వ్ చేస్తే వైసీపీకి కొమ్ము కాసిన పోసాని యాక్ట్ చేసిన సినిమాలు ఎన్ని? స్టార్ హీరోల సినిమాల్లో అతడు కనిపించాడా? ఒకప్పుడు పవన్ కల్యాణ్ ప్రతి సినిమాలో ఉండే అలీ పరిస్థితి ఏమైంది? టీవీ షోలు, అడపాదడపా సినిమాలు చేసుకోవడం తప్ప భారీ సినిమాల్లో కనిపించడం లేదు. కొన్నేళ్ల నుంచి ఇండస్ట్రీలో ఉన్న వాళ్లిద్దరి పరిస్థితి అలాగుంటే టాప్ రేంజికి కూడా రాని యాంకర్ పరిస్థితి ఊహించుకోవచ్చని అనలిస్టులు అంచనా వేస్తున్నారు.ఏపీలో పోలింగ్ డే ఫైట్స్ యాంకరమ్మను ఆందోళనకు గురి చేశాయట. పబ్లిక్‌లో తన సపోర్ట్ చేసిన పార్టీ మీద ఇంత వ్యతిరేకత ఉందని ఊహించలేదని సదరు యాంకర్ క్లోజ్ సర్కిల్ దగ్గర చెబుతోందట. ఆ వ్యతిరేకత తన మీదకు రాకుండా ఉంటే అదే పది వేలు అని అనుకుంటోందట. సినిమాల్లో ఇంపార్టెంట్ రోల్స్ చేస్తూ, ఈవెంట్స్ యాంకరింగ్ చేస్తూ బిజీగా వుంటున్న ఆ పెళ్లైన యాంకర్ నెక్స్ట్ స్టెప్ ఎలా వుంటుందో చూడాలి.

# గెలుపుపై ధీమా...



విజయవాడ, మే 15, ఆంధ్రప్రదేశ్‌లో చెదురుమదురు సంఘటనల మినహా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కొన్ని నియోజకరవర్గాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ జరిగింది గతంలో కంటే ఎక్కువగా పోలింగ్ నమోదు అవుతున్నట్లు ఎన్నికల సంఘం అంచనా వేస్తోంది. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల మినహా మిగతా చోట్ల పోలింగ్ అనుకున్నదానిపై ఎక్కువగానే నమోదైనట్టు ఓ అంచనా.మహిళలు, యువత ఈసారి ఎక్కువగా పోలింగ్‌లో పాల్గొన్నారని రాజకీయ పార్టీల అంచనా. గెలుపుపై నేతలు ఎవరి అంచనాల్లో వారు నిమగ్నమయ్యారు. ముఖ్యంగా మహిళలు, యువత ఓట్లు తమకే లభిస్తుందని ఫ్యాన్ పార్టీ అంచనాల్లో నిమగ్నమైంది. ఎన్నికల ముందు వై నాట్ 175 స్లోగన్ ఇచ్చిన అధికార పార్టీ, పోలింగ్ తర్వాత 110 సీట్ల వస్తాయని అంచనా వేసింది. రిజల్ట్ తర్వాత ఎంత అన్నది చూడాలి. స్వతహాగా అధికార పార్టీ మాత్రం తామే గెలుస్తామని చెప్పడం సహజం. ఎన్నికల్లో కచ్చితంగా తామే గెలుస్తామని కుండబద్దలు కొట్టేశారు ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి.వందకు పైగానే సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తంచేశారాయన. ఓటింగ్ శాతం పెరిగితే.. ప్రభుత్వం మీద వ్యతిరేకత ఉందని అంటారు. ఏపీలో ఈసారి ఓటింగ్ శాతం పెరుగుతుందన్న సంకేతాల

## ఎవరి లెక్కలు వారివే

నేపథ్యంలో తనదైన శైలిలో జోస్యం చెప్పేశారు సజ్జల. ప్రభుత్వానికి సానుకూలత వల్లే ఓటింగ్ శాతం పెరుగుతోందని వివరించారు. ఇదే సజ్జల 2019 ఎన్నికల్లో మరోలా విశ్లేషించారు. ప్రభుత్వంపై వ్యతిరేకత వల్లే ఓటింగ్ శాతం పెరిగిందని, తమ విజయం తమవైపేనన్నారు. ఆయన అంచనాల ప్రకారం చూస్తే ఇప్పుడు వైసీపీ గెలుస్తుందా అన్నదే అసలు ప్రశ్న.ఇక టీడీపీ విషయానికొద్దాం? ఓటింగ్ సరళి చూస్తుంటే అన్నివైపులా తమకే అనుకూలంగా ఉందని సైకిల్ పార్టీ నేతలు అంచనా. ముఖ్యంగా పట్టణ, సిటీ ఓటర్లు తమవైపు మొగ్గు చూపారన్నది నేతల విశ్లేషణ. ప్రతి దశలోనూ తమదే పైచేయి అని చెప్పుకొచ్చారు. కనీసం కూటమి 130 సీట్ల రావచ్చని లెక్కలు వేసుకుంటున్నారు. టీవీ ఛానెళ్ల విశ్లేషణకు వద్దాం. పోలింగ్ జరుగుతుండగా రెండు ఛానెళ్లు తమ తమ లెక్కలు బయటపెట్టాయి. ఒకరు వైసీపీకి వైపు మొగ్గు చూపగా, మరొకరు టీడీపీకి అనుకూలంగా చెప్పుకొచ్చాయి. ఆ ఛానెళ్ల గురించి అందరికీ తెల్సిందే. పార్టీలకు అనుగుణంగా అంచనాలు వేశాయని అంటున్నారు.సోషల్ ఇంజనీర్, రాజకీయ స్ట్రాటజిస్ట్ పీకే అలియాస్ ప్రశాంత్‌కిషోర్ గురించి అందరికీ తెల్సిందే. ఆయన పెద్దగా మీడియాతో మాట్లాడిన సందర్భాలు చాలా తక్కువ. ఎన్నికలకు రెండురోజుల ముందు తొలిసారి తెలుగు డిజిటల్ వెబ్ పోర్టర్ నిర్వహించిన డిబేట్‌లో క్లారిటీ ఇచ్చేశారు. ఆయన అంచనాలకు అనుగుణంగా ఫలితాలు వస్తాయని చెబుతారు. జగన్ ఎక్కడైతే మొదలుపెట్టారో మళ్లీ అక్కడికే వస్తారన్నది ఆయన మాట. గతంలో వైసీపీకి వచ్చిన 151 సీట్లలో ప్రస్తుతం 51 సీట్లు వస్తాయని అంచనా వేశారు. ఇక ప్రధానంగా తటస్థ ఓటర్లపైనే అందరి దృష్టిపడింది. వాళ్లు ఎటువైపు మొగ్గు చూపితే వారిదే గెలుపని కొంతమంది ఎనలిస్టులు చెబుతున్నమాట. ఓవరాల్‌గా చూస్తే ఈసారి ఎవరి గెలుస్తారన్నది ఎక్కడా క్లారిటీ లేదు. ఈ ఉత్కంఠకు తెరపడాలంటే జూన్ నాలుగు వరకు ఆగాల్సిందే.

# అంతు పట్టని ఓటరు నాడి

విజయవాడ, మే 15, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు ముగిసినా.. ఎవరికి అధికారం అన్నది మాత్రం అంతుచిక్కకుండా ఉంది. పోలింగ్ శాతం మాత్రం భారీగా నమోదయింది. ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు జనం క్యూ కట్టారు. గతంలో ఏఎన్నికల్లో చూడని విధంగా అర్ధరాత్రి దాటేంత వరకూ పోలింగ్ జరిగింది. ఇది ఎవరికి లాభం? ఎవరికి నష్టం అన్నది మాత్రం ఎవరికీ అంతుచిక్కకుండా ఉంది.చివరకు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఏజెంట్లు కూడా ఆ బూత్ లో తమ వైపు ఓటర్లు మొగ్గు చూపుతున్నారని ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. ఇందుకు కారణం ఓటర్లందరూ గుంభనంగా ఉండటమే. ఏ నేత వచ్చినా నవ్వుతో పలుకరిస్తుండటం కూడా అంచనాలకు అందడం లేదు.పోలింగ్ కు వచ్చిన వారిలో అధిక శాతం మంది తమకే ఓటు వేసి ఉంటారని భావించి ఇటు అధికార వైసీపీ కానీ, అటు ప్రతిపక్ష కూటమి నేతలు కూడా ధీమాగానే కనిపిస్తున్నారు. ప్రాంతాల వారీగా, జిల్లాల వారీగా, నియోజకవర్గాల వారీగా పోలింగ్ జరిగే సమయంలో జనం మూడ్ ను బట్టి ఒక అంచనాకు ఈసారి రాలేకపోతున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు చూడలేదని ఒక సీనియర్ నేత వ్యాఖ్యానించడం విశేషం. ప్రభుత్వంపై ఆగ్రహం ఉంటే ఆ స్థాయిలో అర్ధరాత్రి వరకూ వేచి ఉండి ఓటు వేసేవారా? అని అధికార పార్టీ ప్రశ్నిస్తుంది. ఇది పాజిటివ్ ఓటుగానే తాము భావిస్తామని వైసీపీ ఫంఖా భజాయించి చెబుతుంది. కానీ ఈ ప్రభుత్వం పోతేనే తమ బతులకులు మారతాయని భావించి ఓటర్లు కసితో ఉన్నారని, అందుకే ఎంత సమయమైనా వేచి ఉండి మరీ ఓటు వేసి ఈ ప్రభుత్వాన్ని దించడమే లక్ష్యంగా పెట్టుకుని క్యూ లైన్లలో గంటల తరబడి నిలుచున్నారన్నది కూటమి నేతల వాదన. ప్రాంతాల వారీగా చూసుకుంటే ఈసారి ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు, ప్రకాశం, రాయలసీమలో అత్యధిక స్థానాలను సాధించి తీరుతామని చెబుతున్నారు. చివరకు ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లా కడపలోనూ తాము ఆశించిన దానికంటే బెటర్ ఫలితాలు సాధిస్తామని చెబుతున్నారు. అందుకే తమలో అంత కాన్ఫిడెన్స్ ఉందని అంటున్నారు అయితే విశ్లేషకులకు కూడా ప్రజల నాడి అందడం లేదు. మహిళలు, వృద్ధులు, యువత అధిక సంఖ్యలో రావడంతో కొంత అటుఇటుగానే ఫలితాలు ఉంటాయని అంచనాలు వినపడుతున్నాయి. ఎవరు గెలిచినా మ్యాజిక్ ఫిగర్ కు బోర్డర్ లోనే ఉంటారన్నది ఎక్కువ మంది విశ్లేషకుల అంచనా. గత ఎన్నికల్లో మాదిరి వన్ సైడ్ ఎన్నికలు మాత్రం ఈసారి జరగలేదన్నది అందరూ అంగీకరించే వాస్తవం. మహిళలు ఎవరివైపు మొగ్గు చూపితే వారిదే అధికారం. అందుకే మహిళ ఓటర్లు సంక్షేమ పథకాలకు ప్రభావితులయి ఓటు వేశారా? లేదా మార్పుకోసం కొంగు బిగించారా? అన్నది మాత్రం అర్థం కాకుండా ఉంటుందన్నారు. ఈసారి ఎన్నికల్లో ఎలక్షనీరింగ్ తో పాటు సోషల్ ఇంజినీరింగ్ కూడా బాగా పనిచేసే ఛాన్స్ ఉందన్నది ఎక్కువ మంది విశ్లేషకులు అందిస్తున్న అభిప్రాయంగా ఉంది. మరి జూన్ 4వ తేదీన గాని ఎవరు విజేత అన్నది తెలియదు.

# పిఠాపురం మెజార్టీపైనే ఆశలన్నీ

కాకినాడ, మే 15,రాష్ట్రంలో ఎవరు గెలిచినా ఓడిన పర్వాలేదు, కానీ పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎట్టి పరిస్థితుల్లో గెలువకూడదనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రణాళిక. ఆ మేరకు యుక్తులు, కుయుక్తులు పన్నారు. కాకినాడ జిల్లాలో విశేష రాజకీయ అనుభవం ఉన్న వంగా గీతను బరిలోకి దించారు. అయినా గెలుపు ఆమడదూరంలో ఉండటంతో తన పార్టీకి చెందిన ప్రముఖులు, ఉద్దండ నేతలను రంగంలోకి దింపారు. గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ మిథున్ రెడ్డి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, తుని ఎమ్మెల్యే దాడిశెట్టి రాజాలకు మండలాల వారీగా పర్యవేక్షణ భాద్యతలు అప్పగించారు. చివరాఖరి రోజుల్లో డబ్బు పంపిణీ నిమిత్తం నగదు డంప్‌ను నెల రోజుల ముందే దింపటంతో పాటు ప్రైవేటు సిబ్బందిని భారీగా దింపారు. అయినా పిఠాపురం పీఠాన్ని పవన్ కల్యాణ్‌ను నుంచి దూరం చేయలేమనే నమ్మకం బలంగా పెరగడంతో డబ్బు, బంగారం, ఇతర ప్రలోభాలకు గురి చేశారు. అయితే ఓటరు మాత్రం ఎలాంటి చిల్లర ప్రలోభాలకు లొంగలేదు. చివరకు ప్రచారం చివరిరోజున స్టేజీ మీద వంగా గీత బోరున విలపించింది. ఆ తర్వాత మా పార్టీ అధికారంలోకి వస్తే ఆమె డిప్యూటీ సీఎం అని ముఖ్యమంత్రి జగన్ ప్రకటించేశారు.ఓటింగ్ రోజు వరకు వంగా గీత ఎక్కని మెట్టు లేదు. అభ్యర్థించని గడపలేదు. పిఠాపురంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి వంగా గీతకు ఎదురైన పరిస్థితి చూస్తే ఈ పరిస్థితి ఎవరికి రావొద్దనే అభిప్రాయం, బాధ కలుగుతుంది. చివరకు ఓటింగ్ రోజున ప్రతీ పోలింగ్ బూత్‌ను సందర్శించి నిబంధనలకు విరుద్ధంగా ఓటు కోసం ప్రాధేయపడటం కనిపించింది. కొన్ని చోట్ల జనసేన నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అయినా గెలుపు కష్టమే అనే ఫీలింగ్ ఆమెలో రోజు రోజుకూ బలంగా నిలిచిపోయేలా సంఘటనలు చేశాయి. స్వయంగా ఓటర్లు వంగా గీతనే గాజు గ్లాస్‌కు ఓటు వేయమని చెబుతున్నారని చెప్పిన మాటలకు అమె హతాసురాలయ్యింది. అయితే పవన్ కల్యాణ్‌పై పోటీ చేస్తున్న వంగా గీతను ఓటర్లు కనీసం పోలింగ్ కేంద్రాల్లో పట్టించుకున్న దాఖలాలే లేవు. పరిస్థితిపై వంగాగీత అసహనం వ్యక్తం చేస్తూ ఒకానొక దశలో పోలీసులపై విరుచుకుపడ్డారు.రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను అభిమానులు, ప్రజలు గుండెల్లో పెట్టుకొని పూజించారు. కేవలం పిఠాపురం, గోదావరి జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా జనసేన అధినేతపై వెలకట్టలేని ప్రేమను కురిపించారు. పిఠాపురం మొత్తం ఏకతాటిపైకి వచ్చి జనసైనికుడికి నీరాజనం పలికారు. పిఠాపురంలో కులం, మతం, ప్రాంతం అనే తేడా లేకుండా జనసేన చీఫ్ పవన్ కల్యాణ్‌ను గుండెల్లో పెట్టుకొన్నారు. ఆయన నుంచి డబ్బు ఆశించకుండా ఓటు వేసేందుకు సిద్దపడ్డారు. ప్రజల అండతో వార్ వన్ సైడ్ అనే విధంగా తీర్పును చెప్పడానికి సిద్దమయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో గెలుపు గురించి పక్కన పెడితే మెజార్టీ ఏ రేంజ్‌లో ఉంటుందోననే చర్చ పిఠాపురంలోనే కాదు, తెలుగు రాష్ట్రాల్లోను, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారిలో భారీగా జరుగుతున్నది.

# ఆళ్లగడ్డలో భగ్గుమన్న పాత కక్షలు

కర్నూలు, మే 15 నంద్యాల జిల్లా ఫ్యాక్షన్ గడ్డ ఆళ్లగడ్డలో మరోసారి పాతకక్షలు భగ్గుమన్నాయి. నివురుగప్పిన నిప్పులా ఉన్న పాతక్షక్షలు పోలింగ్ సందర్భంగా మళ్లీ పురుడుపోసుకున్నాయి. పోలింగ్ ముగిసిన తర్వాత ఆళ్లగడ్డలో తెలుగుదేశం అభ్యర్థి, మాజీమంత్రి అఖిలప్రియ బాడీగార్డుపై హత్యాయత్నం జరిగింది. తీవ్రంగా గాయపడిన యువకుడి పరిస్థితి విషమంగా ఉంది...ఏపీలో పోలింగ్ సందర్భంగా హింస పెద్దఎత్తున చెలరేగింది. తెలుగుదేశం , వైకాపా( వర్గీయులు బాహాబాహీకి దిగారు. ఆస్తులు ధ్వంసం చేసుకున్నారు. అన్నిచోట్ల ప్రత్యర్థుల మధ్య గొడవలు జరిగితే ఆళ్లగడ్డ లో మాత్రం ఒకే పార్టీకి చెందిన ఇరువర్గాల మధ్యే ఘర్షణ చోటుచేసుకుంది. ఒకే పార్టీలో ఉంటూ ఉప్పు,నిప్పుగా మారిన మాజీమంత్రి భూమా అఖిలప్రియా, తెలుగుదేశం నేత ఏవీ సుబ్బారెడ్డి వర్గీయుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉన్నాయి. అధినేతకు ఇచ్చిన మాట ప్రకారం పోలింగ్ వరకు సంయమనం పాటించిన ఇరువర్గాలు... ఓటింగ్ ముగిసిన వెంటనే కొట్లాటకు దిగారు. అఖిల ప్రియ బాడీగార్డుగా పనిచేస్తున్న నిఖిల్‌పై)హత్యాయత్నం జరిగింది. తీవ్రంగా గాయపడిన అతడు ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. దీనికి ఏవీ సుబ్బారెడ్డి వర్గమే కారణమని అఖిలప్రియ అనుమానిస్తోంది. లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఆయనకు స్వాగత ఏర్పాట్లు చేసే సందర్భంలో ఇరువర్గాలు పోటీపడ్డాయి. ఆ సమయంలో అఖిలప్రియ వర్గీయులు ఏవీ సుబ్బారెడ్డిపై దాడికి పాల్పడ్డారు. అప్పుడు అఖిలప్రియ( బాడీగార్డుగా పనిచేస్తున్న నిఖిల్ ఏవీ సుబ్బారెడ్డిపై చేయిచేసుకున్నాడు. భూమా వర్గీయుల దాడిలో ఏవీ సుబ్బారెడ్డి( నోటి నుంచి రక్తం కూడా వచ్చింది. ఆయనను కొడుతున్నప్పుడు భూమా అఖిల ప్రియ అక్కడే ఉన్నారు. పైగా ఆమె ఏవీ సుబ్బారెడ్డి వర్గీయులను బెదిరించడం కనిపించింది. ఈ వ్యవహారంపై అధినేత చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఇరువర్గాలను పిలిచి తీవ్రంగా మందలించారు. మరోసారి ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే సహించేది లేదని తేల్చి చెప్పారు. ఎవరి పరిధిలో వాళ్లు తమ పనిచేసుకుంటూ వెళ్లాలని సూచించారు. ఎన్నికలు ముగిసే వరకు ఇరువర్గాలు సైలెంట్ కాకపోతే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని కూడా చెప్పారని తెలిసింది. దీంతో ఇరువర్గాలు చాలా సైలెంట్‌గా ఎవరి ప్రచారం వారు చేసుకున్నారు. దెబ్బతిన్న అవమానం నుంచి తేరుకుని ఏవీ సుబ్బారెడ్డి... అదునుకు ఎదురుచూశారు. ఆళ్లగడ్డలో ప్రశాంతంగా ఎన్నికలు ముగియడంతో పట్టరాని కోపంతో నిఖిల్‌పై దాడి చేయించినట్లు అఖిలప్రియవర్గం ఆరోపిస్తోంది. ఈ దాడిలో నిఖిల్ తీవ్రంగా గాయపడగా.. నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పాత పగతో సుబ్బారెడ్డి మనుషులే ఈ పని చేయించి ఉంటారని స్థానిక చర్చ నడుస్తోంది. గత ఎన్నికలకు భిన్నంగా ఈసారి ఆళ్లగడ్డలో ఎలాంటి గొడవలు జరగలేదని ప్రజలంతా ఊపిరి పీల్చుకుంటుంటే...ఇప్పుడు ఒకే పార్టీలో ఉన్న ఇరువురు నేతలు ఏకంగా దాడులు చేసుకోవడం చూస్తే మళ్లీ భయాందోళనలు కలుగుతున్నాయి. ఈ దాడులు ఏ స్థాయిలోకి వెళ్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ఒకప్పుడు ప్రాణస్నేహితులుగా ఉన్న భూమా, ఏవీ సుబ్బారెడ్డి కుటుంబాలు....నాగిరెడ్డి మరణానంతరం విడిపోయాయి. బినామీ ఆస్తులు, పదవుల పంపకాలే విభేదాలకు కారణమని తెలుస్తోంది.

# ఎవరికి ఓటు? ? ఎవరికి పోటు..?

## ఏపీలో ఎవరి అంచనాలు నిజమవ్వతున్నాయి..!!

విజయవాడ,ఆంధ్రప్రదేశ్ లో ఓటర్లు పోటెత్తారు.. గత రికార్డులను తిరగరాసి మరీ పోలింగ్ బూత్లకు క్యూకట్టారు జనం. మరి పోటెత్తిన ఓటు ఎవరికి పడింది.. పోటు ఎవరికి పడింది అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఎవరికి వారు విశ్లేషణలతో తమకే అనుకూలమంటూ పార్టీలు ప్రకటిస్తున్నాయి. అటు కార్యాజాకాయ్లుకు కూడా అంతచిక్కని ఏపీ నాడి.. ఎవరికి పట్టం కట్టబోతుంది.2019 ఎన్నికల్లో నమోదైన పోలింగ్ 79.74 శాతం?ి 80శాతానికి పైగా ఓట్లు పడ్డాయి. ఓటర్లలో చైతన్యం పెరిగింది.. తమ హక్కును గుర్తించారు. ఫలితంగానే పోస్టల్ బ్యాలెట్ నుంచి బూత్ల వరకూ పోటెత్తారు. పెరిగిన ఓటింగ్ ప్రభుత్వానికి అనుకూలంగా పడిందా.. లేక వ్యతిరేకంగా పడిందా అన్నది ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. దీనిపై పార్టీలు ఎవరికి వారు తమవద్ద ఉన్న లెక్కలతో అంచనాలపై కుస్తీ పడుతున్నాయి.అధినేత చంద్రబాబునాయుడు. దేశవ్యాప్తంగా మోదీ హవాతో పాటు.. రాష్ట్రంలో ఎన్డీయే భారీ మెజార్టీతో గెలుస్తుందని జోస్యం చెబుతున్నారు చంద్రబాబునాయుడు.అర్ధరాత్రి వరకూ మహిళలు క్యూలో ఉండి మరీ ఓట్లు వేశారని.. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వాళ్లే మళ్లీ ఆశీర్వదించారని వైసీపీ బలంగా నమ్ముతోంది. గెలుపోటములపై చర్చలు నడుస్తుండగానే అటు అధికారులపై పార్టీల మధ్య మాటలయుద్ధం నడుస్తోంది. కొందరు అధికారులు టీడీపీతో కుమ్మక్కయ్యారని మంత్రి అంబటి రాంబాబు సంచలన ఆరోపణలు చేశారు.

# 16 స్ట్రాంగ్ రూమ్ ల వద్ద స్ట్రాంగ్ సెక్యూరిటి.. జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్..




కర్నూలు జిల్లా ప్రతినిధి మే 15 విభారె న్యూస్..స్ట్రాంగ్ రూమ్ ల సిసికెమెరాల కమాండ్ కంట్రోల్ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ.కర్నూలు రాయలసీమ యూనివర్సీటిలో 3 బ్లాకులలో ,16 స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రత ను కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్ బుధవారం పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమెరాల కమాండ్ కంట్రోల్ ను పరిశీలించారు.స్ట్రాంగ్ రూమ్ ల యొక్క మూడంచెల భద్రతలో మొదటి స్థాయిలో కేంద్ర సాయుధ బలగాలు, రెండవ స్థాయిలో ఆర్మ్డు రిజర్వ్డు బలగాలు, తృతీయ స్థాయిలో సివిల్ పోలీసు బలగాలను మోహరింపచేశాము.స్ట్రాంగ్ రూమ్ ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. ప్రతి స్ట్రాంగ్ రూమ్, పరిసరాలలో సిసిటివి కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంచాము.ప్రతి స్ట్రాంగ్ రూమ్ వద్ద కేంద్ర,రాష్ట్ర పోలీసు బలగాలతో గస్తీ ఏర్పాటు చేశాము.స్ట్రాంగ్ రూమ్ లకు ఉన్నత స్థాయి అధికారులను ఇంచార్జీలుగా నియమించాము.ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ ఇంజన్లను కూడా ఏర్పాటు చేయడం జరిగింది.విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్ లు కూడా ఏర్పాటు చేశాం.ఎవరైనా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.స్ట్రాంగ్ రూమ్స్ ఏర్పరిచిన కేంద్రాల ఎంట్రెన్స్ గేట్ లోపలికి,పరిసరాలలోకి గుర్తింపు కార్డులు లేని వ్యక్తులు లేదా అనధికార వ్యక్తులు,ఇతరుల వాహనాలకు అనుమతిలేదు.రాజకీయ పార్టీల అభ్యర్థులు,వారి ఏజెంట్లు ఔటర్ పెరిమీటర్ వరకు మాత్రమే వెళ్ళాలి.రిటర్నింగ్ అధికారులు ఇన్నర్ పెరిమిటర్ వరకు వెళ్ళాలి.స్ట్రాంగ్ రూమ్‌కి ఒకే ప్రవేశ ద్వారం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాం. గదికి డబుల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేయబడింది. స్ట్రాంగ్ రూం 24 గంటలూ సాయుధ బలగాల రక్షణలో ఉంటుంది, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించబడుతుంది.స్ట్రాంగ్ రూమ్‌లో అమర్చిన సీసీటీవీ కెమెరాలు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (సి సి సి)కి కనెక్ట్ చేయబడ్డాయి.పారదర్శకంగా,అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో జూన్ 4 న ఓట్ల లెక్కింపు జరిగే వరకు దృశ్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు చర్యలు చేపట్టాము.స్ట్రాంగ్ రూమ్‌లకు సీసీటీవీ కవరేజీతో సహా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించడానికి గెజిటెడ్ అధికారులతో పాటు, పోలీసు అధికారులు 24 గంటలూ డ్యూటీలో ఉండే విధంగా చర్యలు చేపట్టాం. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ లు సెక్యూరిటీ, కారిడార్ మొదలైన వాటి యొక్క సీల్డ్ వేసిన డోర్‌లను కవర్ చేసే విధంగా సీసీటీవీ కవరేజ్/వీడియోగ్రఫీ ఏర్పాటు చేశాము. స్ట్రాంగ్ రూమ్ లు తెరిచే ముందు, మూసివేసే సమయంలో సీసీటీవీ కవరేజ్/వీడియోగ్రఫీ మొత్తం సీలింగ్ ప్రక్రియ స్పష్టంగా కనిపించే విధంగా సిసిటివీలు ఏర్పాటు చేశాం. సీసీటీవీ ఫుటేజీ డేటా నిల్వ ఉండే సీసీటీవీ కెమెరాలు అమర్చాము. ప్రతి ఎంట్రీ ,ఎగ్జిట్ దగ్గర విజిట్ చేసిన అధికారులు రిజిస్టర్ /లాగ్-బుక్ లో సంతకాలు చేసే విధంగా ఏర్పాటు చేశాము.ఇందులో పరిశీలకులుగా జిల్లా ఎన్నికల అధికారి / జిల్లా కలెక్టర్ లేదా జిల్లా ఎస్పీ లేదా ఆ పై స్థాయి అధికారులు ఉంటారు. జిల్లా ఎన్నికల అధికారి నుండి ఎప్పటికప్పుడు నివేదికను చీఫ్ ఎలక్షన్ కమిషన్ అధికారికి పంపబడుతుంది. రాజకీయ పార్టీల అభ్యర్థులు,పుకార్లు, అపోహలను నమ్మవద్దు. తొందరపడకుండా నిర్ధారణకు అవసరమైతే ఎలక్షన్ కమిషన్ దృష్టి కి తీసుకువెళ్ళాలి.అపోహలు, తప్పుడు సమాచారాలు నమ్మి జిల్లాలో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే పోలీసు శాఖ తీవ్రంగా పరిగణించి అటువంటి వారి పై కఠిన చర్యలు తీసుకుంటాము.జూన్ 4 న ఓట్ల లెక్కింపు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. అసాంఘిక శక్తులు,రౌడీ షీటర్ల పై ప్రత్యేక పోలీసు నిఘా కొనసాగుతోంది. జిల్లా ఎస్పీ వెంట కర్నూలు డిఎస్పీ కె.విజయశేఖర్, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు,స్పెషల్ బ్రాంచ్ సిఐలు నాగరాజు యాదవ్,శ్రీనివాస రెడ్డి, కర్నూలు తాలుకా సిఐ శ్రీధర్, ట్రాఫిక్ సిఐ గౌతమి, ఆర్ ఐలు ఉన్నారు.

## బుధవారం వృషభ సంక్రమణంను పురస్కరించుకొని సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు..



కర్నూలు జిల్లా ప్రతినిధి మే 15 విభారె న్యూస్...వృషభ సంక్రమణ పర్వదినంను పురస్కరించుకుని శ్రీ సూర్యనారాయణ స్వామి వారి మూల విరాట్ కు పురుష సూక్త విధానంతో అరుణ పారాయణ పూర్వకముగా సుగంధ ద్రవ్య జలాభిషేకం, క్షీరాభిషేకము, విశేషాలంకరణము అర్చన నక్షత్ర మహా మంగళహారతి మంత్రపుష్పము వేద స్వస్తి అరుణ,మహాసౌర హోమము నిర్వహించడం జరిగినది.భక్తాలు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి అభిషేకమును స్వయంగా వీక్షించి, దర్శించి స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించడం జరిగినది.

## ఎన్నికల విధుల్లో గౌరవ వేతనం వ్యత్యాసాలు తొలగించాలి - ఆప్టా...

కర్నూలు జిల్లా ప్రతినిధి మే 15 విభారె న్యూస్..రాష్ట్రం లో ఎన్నికలు విజయవంతంగా,ఓటింగ్ శాతం అత్యధిక స్థాయి లో నమోదు అగుటకు కృషి చేసిన ఎన్నికల కమిషనర్ కి అభినందనలు ,ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి సౌకర్యాల కొరకు కృషి చేసిన రాష్ట్రం లోని ఎన్నికల అధికారులకు కృతజ్ఞత లు తెలియ చేస్తూ ఏ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ జి ఎస్ గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రకాష్ రావు కొన్ని వినతులు వినతి పత్రం ద్వారా తెలియచేసారు.రాత్రి పగలు తేడా లేకుండా ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి ఆంధ్ర ప్రదేశ్ లో ఇచ్చిన గౌరవ వేతనం తెలంగాణ రాష్ట్రం కంటే చాలా తక్కువ గా వుంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో ఒక్కొక్క జిల్లాలో నియోజక వర్గంలో గౌరవ వేతనం వేర్వేరు రకాలుగా ఇవ్వడం జరిగింది. వాటిని సరిద్దవలసిన విధంగా చర్యలు తీసుకోవాలి.వేసవి సెలవుల లో ఎన్నికల విధుల యందు పాల్గొన్న ఉపాధ్యాయులకు సరెండర్ లీవ్ మంజూరు చేసే ఆనవాయితీ వుంది ,దాని ప్రకారం సరెండర్ లీవ్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేయాలి.ఎన్నికల విధులకు సంబంధించిన ఉత్తర్వులు పంపిణీ చేసిన విధంగా అందరికీ ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్ పంపిణీ చేయాలి. ఎన్నికల సామాగ్రి తీసుకొనే కేంద్రాల్లో చాలా మంది రిటర్నింగ్ అధికారులు పని ఒత్తిడి వల్ల సర్టిఫికెట్ లు ఇవ్వలేదు.ఈ అంశాలు గురించి తగు ఆదేశాలు జారీ చేయవలసినదిగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కి వినతి పత్రాన్ని సమర్పించారు..

## ఎన్జీవో కాలనీలో ఉన్న పార్కు పరిశీలన



-విభారెన్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 15- నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీలో ఉన్న పార్కు ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్ పరిశీలించారు. ఎన్జీవో కాలనీలో ఉన్న పార్కు ఎంతో అభివృద్ధి చెందిందని. పార్కులోఅందరికీఉపయోగపడేవిధంగాపలుమిషనరీస్ ఏర్పాటు చేసామన్నారు. సకల సౌకర్యాలు కల్పించామని ఆయన అన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్‌హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ.శివప్రసాద్ రెడ్డి. మున్సిపల్. సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు.. ఏ ఈ నాగరాజు

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- మే 15 నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ రఘువీరారెడ్డిల కు నంద్యాల జిల్లా ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజు గౌడ్ అభినందనలు తెలియజేశారు 2024 ఎన్నికలలో పార్టీలకు అతీతంగా ఎన్నికలు జరిపించడంలో రాష్ట్రానికి ఆదర్శం అని అత్యధిక పోలింగ్ నమోదునుజరిపించారని నంద్యాల జిల్లా చరిత్రలో గత 15 సార్లు ఎన్నికలు జరిగాయని అయితే ఇంత పెద్ద ఎత్తున పోలింగ్ నమోదు కాలేదని పౌరులు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వేశారని శాంతి భద్రతలను కాపాడి అసాంఘిక కార్యక్రమాలు ఏమీ జరగకుండా పౌరులకు రక్షణ కల్పించారని అదేవిధంగా కర్నూలు నంద్యాల జిల్లాలలో డోన్ ప్రథమ పోలింగ్ శాతాన్ని తీసుకొని వచ్చిన డోన్ రిటర్నింగ్ ఆఫీసర్ ఆర్డీవో మరియు డీఎస్పీ కట్టుదిడ్డమైన భద్రత కల్పించి రెండు జిల్లాలలో ప్రథమ స్థానం గా డోన్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని పోలింగ్ అత్యధిక శాతాన్ని అందించిన ఘనత ఆర్డిఓ డిఎస్పి లకి దక్కుతుందని ప్రజాస్వామ్యపరంగా ఎన్నికలను జరిపించినందుకు నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు కి నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి నంద్యాల జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ రఘువీరా రెడ్డి కి జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ఏఈ నాగరాజ్ గౌడ్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు



# కామ్రేడ్ నక్కి రామన్నకు ఘన నివాళులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 15-కామ్రేడ్ నక్కి రామన్న 34 వ వర్ధంతిని పురస్కరించుకొని నంద్యాల పట్టణంలో సిపిఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి కే ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నక్కి రామన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం పెత్తందారులు భూస్వాములపై అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప పోరాట ధీరుడు నక్కి రామన్న అన్నారు. పెత్తందార్ల ఆధీనంలో ఉన్న భూములను దళితులకు పంపిణీ చేశాడని హత్యా రాజకీయాలకు దోపిడీలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశాడని పేర్కొన్నారు. డోన్ నియోజకవర్గం పరిధిలోని కటారికొండ గ్రామంలో దళితులకు వెన్నంటి ఉండి భూస్వాముల కబంద హస్తాల్లో ఉన్న భూములను దళితులకు ఇప్పించాడని అలాగే గ్రామంలో రెండు వర్గాల మధ్య నలిగిపోతున్న ప్రజలకు స్వేచ్ఛగా తిరిగేందుకు అనేక పోరాటాలు చేశాడని తెలిపారు. ప్రభుత్వ భూములలో ఎర్రజెండాలు పాతి దళితులకు పంచిన చరిత్ర నక్కి రామన్నది అన్నారు. తనపై అనేకమార్లు హత్యా ప్రయత్నాలు జరిగినప్పటికీ ప్రజల స్వేచ్ఛ వాయువుల కోసం ముందుండి పోరాడి ప్రాణాలు అర్పించిన చరిత్ర రామన్నది అన్నారు. ఆయన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి సుంకయ్య, సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు,గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మోటా రాముడు, డిహేచ్ పియస్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సిపిఐ బేతంచెర్ల నాయకులు భార్గవ్, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్, గోస్పాడు మండల సహాయ కార్యదర్శి జిలాన్ బాష, సిపిఐ నాయకులు హుస్సైన్ బాష, భూమని శ్రీనివాసులు, హుస్సైని,ఆనంద్, సుశీలమ్మ పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్స్ కమాండ్ కంట్రోల్ రూం పరిశీలన

### జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా.కె.శ్రీనివాసులు



-విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 15-నంద్యాల పట్టణ శివారు ప్రాంతం పాణ్యం మండలం నెరవాడ గ్రామం సమీపంలోని ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములలో భద్రపరచిన ఈవీఎంల పర్యవేక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా..కె.శ్రీనివాసులు బుధవారం పరిశీలిస్తూ సాంకేతిక నిపుణులకు పలు ఆదేశాలు జారీ చేశారు.అత్యంత మూడంచెల భద్రత నడుమ వున్న స్ట్రాంగ్ రూమ్ ల పర్యవేక్షణ నిమిత్తం కమాండ్ కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ఫుటేజ్ ను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. సీసీటీవీల ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు చూసుకొనెలా పార్టిషన్ చేయాలని ఆర్ అండ్ బి ఎస్ఈ ని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన ఇన్వెర్టర్ లను ఏర్పాటు చేసుకోవాలని ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కాలేజీలో వున్న లైబ్రరీ హాలులో మీడియా రూమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి ఎస్ఈ ని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మజ, ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, నంద్యాల తాసిల్దార్ చంద్రశేఖర్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# జేసీ ప్రభాకర్‌రెడ్డికి అస్వస్థత..



తాడిపత్రి:మే :16 అనంతపురం జిల్లా తాడిపత్రిలో మంగళవారం జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. దాని ప్రభావంతో మాజీ ఎమ్మెల్యే ,తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ కారణంగా జేసీ ప్రభాకర్ రెడ్డి సికింద్రాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారని ఆయన కుమారుడు జేసీ అస్మిత్‌రెడ్డి తెలిపారు.ఆయన్ను చూసేందుకు కార్యకర్తలు రావొద్దని విజ్ఞప్తి చేశారు.వైద్య నిర్ధరణ పరీక్షలు పూర్తయిన తర్వాత బులెటిన్ విడుదల చేస్తామని వైద్యులు ప్రకటించారు.

## నిరాడంబరంగా 'వృద్ధాశ్రమంలో' పెళ్లి వేడుకలు..

తుగ్గలి: మే16 పెళ్లి వేడుకలు అంటే ఈకాలంలో చాలామంది హంగు ఆర్భాటాలతో పాటు వారి బంధువులు స్నేహితులతో కలిసి చేసుకోవడం మనం తరచూ చూస్తుంటాం. అయితే గత 14 ఏళ్లుగా వారి పెళ్లి వేడుకలను వారి పిల్లల పుట్టిన రోజు వేడుకలు వారి కుటుంబంలో జరిగే ప్రతి కార్యక్రమాన్ని వృద్ధాశ్రమంలోనే జరుపుకోవడం ఆనివాయితీగా పెట్టుకుని ముందుకు సాగుతున్న వ్యక్తి ఎవరనే విషయాన్ని ఇప్పుడు మనం తెలుసుకుందాం. ఆయన ఎవరో కాదు మనందరికీ తెలిసిన వ్యక్తి ఆయనే వీఆర్వోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎన్జీవోస్ పత్తికొండ తాలూకా ఉపాధ్యక్షుడు, రాతన విఆర్ఓ నాగేంద్ర. ఆయన బుధవారం తన పెళ్లి రోజు వేడుకలను వారి కుటుంబ సభ్యులతో కలిసి పత్తికొండ పట్టణంలోని హోసూరు రోడ్డులో గల జ్యోతి వృద్ధాశ్రమంలో వృద్ధుల సమక్షంలో ఎంత మాత్రం హంగు ఆర్భాటాలు లేకుండా నిరాడంబరంగా జరుపుకుంటూ అందరికీ ఆదర్శంగా ఆయన ప్రత్యేకత.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190